క్లుప్తంగా

రూ.10 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

చల్లపల్లి: స్థానిక ఎస్టీ కాలనీలోని ఐదవ వార్డులో రూ.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చల్లపల్లి మండలంలోని డ్రెయినేజీలకు మొత్తం రూ.40 లక్షలు మంజూరు కాగా చల్లపల్లి ఐదవ వార్డులో ప్రస్తుతం రూ.10 లక్షలతో పనులు చేస్తున్నట్లు వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి శివప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు కొమ్ము డేవిడ్, కొల్లూరి ముద్దుకృష్ణ, సయ్యద్ జహీర్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఉప్పాల రంగ, నాగార్జున, కాంట్రాక్టర్ గొరిపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలు, వృద్ధులకు భోజన ప్యాకెట్లు పంపిణీ



అవనిగడ్డ: భారతదేశ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సీతాయలంకకు చెందిన టీసీఎస్ కన్సల్టెంట్ పోలాబత్తిన బిపిన్ చంద్రపాల్ ఆర్థిక సహాయంతో షిర్డీ సాయి అన్న ప్రసాద సేవా సంస్థ నిర్వాహకులు చిట్లా ప్రసాద్ ఆధ్వర్యంలో 35 మంది వృద్ధులు, అనాథలకు గురువారం భోజన ప్యాకెట్లు అందజేశారు. స్థానిక లంకమ్మ అమ్మవారి ఆలయం, వంతెన సెంటర్, పులిగడ్డ బస్టాప్ సెంటర్‌లో ఉన్న అనాథలు, వృద్ధులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రపాల్ కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

మల్లేశ్వరం ఏఎంసీలో పీపీసీ ఏర్పాటు చేయాలి

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరం, పెదపాండ్రాక తదితర గ్రామాల్లో పండిన ధాన్యాన్ని మల్లేశ్వరం వ్యవసాయ మార్కెట్టు కమిటీ(ఏఎంసీ) ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రం(పీపీసీ) ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల రైతులు గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో ఉన్న పద్ధతిలోనే మల్లేశ్వరం సచివాలయం ద్వారా ఆన్‌లైన్ చేసి ధాన్యం మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

కృష్ణా వర్సిటీలో ఆటల పోటీలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న ఆటల పోటీలు గురువారం ప్రారంభయ్యాయి. ఈ పోటీలను ఉపకులపతి ఆచార్య కె.రాంజీ సూచనల మేరకు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయ్‌కుమారి సమన్వయంలో వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకె సుందరకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాంబాబు పాల్గొన్నారు.వర్సిటీ ప్రాంగణంలోని మూడు కళాశాలల విద్యార్థులు, నూజివీడు పీజీ క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు టేబుల్ టెన్నిస్‌కు సంబంధించి 20 జట్లు, వాలీబాల్‌కు 4 జట్లు, చెస్ విభాగంలో 37 మంది పాల్గొన్నారు.

అడ్డగోలుగా చెరువుల తవ్వకాలు

- అనుమతుల్లేకుండా పోరంబోకు భూముల్లో చెరువుల తవ్వకం
- బంటుమిల్లి మండలం మణిమేశ్వరం, ముంజులూరు పరిధిలో తవ్వకాలు
- తవ్వకాల వద్దకు ఎవరూ రాకుండా రహదారులకు గండ్లు
- పెడన మండలం జింజేరులో శ్మశానాన్ని ఆక్రమించి చెరువు తవ్వకం
- అధికారంలోకి రాగానే పచ్చ నేత అక్రమాలు

తోటకూర నాడే వంగనిది...అన్నట్టు శ్మశానాన్ని ఆక్రమించి చెరువుగా మార్చేస్తే అడ్డుకున్న నాథుడే లేక పోయేసరికి ఇప్పుడు నన్నెవడ్రా ఆపేది అన్నట్టు ఇప్పుడు ఏకంగా లజ్జబండ డ్రైన్ పక్కన పోరంబోకు భూములను ఆక్రమించేసి చెరువులుగా మార్చేస్తున్నాడు. పెడన మండలం జింజేరు గ్రామానికి చెందిన పచ్చ నేత అరాచకాలకు అంతే లేకుండా పోతోంది.



పోరంబోకు స్థలంలో తవ్విన చెరువులు

పెడన: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో పచ్చనేతల అరాచక పర్వం మొదలైంది. పెడన మండలం జింజేరు గ్రామానికి చెందిన పచ్చ నేత ఒకరు మూడు నెలల కిందట గ్రామంలో శ్మశానానికి చెందిన స్థలాన్ని కబ్జా చేసి మట్టిని విక్రయించేసి చెరువుగా మలుచుకున్నాడు. ఈ విషయం అధికారులకు తెలిసినా వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఇక తనను ఎవరూ ఏమీ అనరనే ధీమా పెరిగింది. దాంతో మరొక అడుగు ముందుకు వేసి ఇప్పుడు లజ్జబండ పక్కనే ఉంటున్న పోరంబోకు భూములను ఆక్రమించి చెరువులుగా చేయడం ప్రారంభించారు. ఈ పోరంబోకు భూములన్నీ కూడా పెడన మండలం జింజేరు గ్రామానికి ఆనుకుని బంటుమిల్లి మండలం ముంజులూరు, మణిమేశ్వరం పరిధిలో ఉన్నాయి. రెండు, మూడు నెలలు కిందట పనులు మొదలు పెట్టగానే రైతులు తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పుడు చెరువులను తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేశామని బంటుమిల్లి రెవెన్యూ అధికారులు చెప్పారు. జరిమానా కూడా వేశామన్నారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. తాజాగా ఆ నేత మళ్లీ చెరువులను తవ్వేందుకు సిద్ధమయ్యాడు. ఈ సారి పక్కా స్కెచ్ వేసి తవ్వేలా ప్రణాళిక రూపొందించడం గమనార్హం.

రెండు పక్కల రహదారికి గండ్లు...

లజ్జబండ డ్రయిన్ పక్కన పోరంబోకు స్థలాలున్నాయి. ఈ స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా చెరువులను తవ్వేస్తున్నారు. అదేమని అధికారులను, క్షేత్రస్థాయిలోని వీఆర్వోలను ప్రశ్నిస్తుంటే అవన్నీ బీడు పోయిన పంట భూములని, రైతులు పంటలు పండక చెరువులుగా మార్చుకుంటున్నారని చెబుతున్నారు. వాస్తవంగా అవన్నీ పోరంబోకు భూములేనని, వాటిని తవ్వేయడం వల్ల శుభ్రంగా పండుతున్న వరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ చెరువులను తవ్వేందుకు యంత్రాలు ఇప్పటికే అక్కడ సిద్ధం చేశారు. ఇతర వాహనాలు, అధికారుల కార్లు, జీపులు ఏవీ అక్కడకు వెళ్లకుండా ఇరువైపులా దారులకు గండ్లు పెట్టారు. వారి అవసరాలకు పక్కనే ఉన్న పొక్లయిన్ వాడుకుంటున్నారు. అధికారులు ఎవరైనా వస్తే అది పనిచేయడం లేదని పక్కన పడేశారని, చెరువులు తవ్వడం లేదని చెబుతూ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు.



చెరువులు తవ్వే దగ్గరకు వెళ్లకుండా రోడ్డుకు గండిపెట్టిన వైనం

పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం

ఆర్ఐని, వీఆర్వోలను పంపిస్తా. పరిశీలించి నివేదిక ఇమ్మని కోరుతా. వారు ఇచ్చిన నివేదిక సక్రమంగా లేకపోతే స్వయంగా వెళ్లి పరిశీలిస్తా. దారికి గండ్లు కొట్టిన విషయాన్ని కూడా అడిగి తెలుసుకుంటా. తప్పకుండా తగు చర్యలు చేపడతాం. అవి పోరంబోకు స్థలాలా లేక పట్టాదారు భూములా అనేది పరిశీలించాల్సి ఉంది. పోరంబోకు స్థలాలు ఆక్రమించుకుంటే ఊరుకునేది లేదు.

– కె.పూర్ణచంద్రరావు, ఇన్‌చార్జి తహసీల్దారు, బంటుమిల్లి

ఇస్తినమ్మా వాయనం..!



కోడూరులో ఉయ్యాల ఊగుతున్న చిన్నారులు



ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాల ఆవరణలో ఉయ్యాల ఊగుతున్న విద్యార్థినులు

కోడూరు: కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో గురువారం వేకువజామునే మహిళలు గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేసి, ఉపవాస దీక్ష చేపట్టారు. సాయంత్రం కాలువల వద్ద ప్రత్యేక స్నానాలనంతరం ఇళ్లలో మళ్లీ అమ్మవారికి అట్ల నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తగా వివాహాలైన యువతులు వాయనాల కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో పూర్తి చేశారు. స్వతంత్రపురం వద్ద ఏర్పాటు చేసిన రోటి ఉయ్యాల వద్ద మహిళల సందడి కనిపించింది. కోడూరులోని బాలభాను విద్యాలయంలో అట్లతద్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆనంద డోలికల్లో అట్లతద్ది సంబరం

నాగాయలంక: మండలంలో తీరప్రాంతంలో గురువారం అచ్చ తెనుగు సంప్రదాయ వేడుక అట్లతద్ది పండుగను ఆహ్లాదకరంగా, సంప్రదాయ రీతిలో జరిపారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి సంస్కృతికి పెద్దపీట వేస్తూ, పాటలు పాడుతూ కోలాహలంగా అట్లతద్ది వేడుకను నిర్వహించారు. వేపచెట్టుకు ఊయలలు కట్టి వాటిని ప్రత్యేకంగా అలంకరించి ఊయలలు ఊగారు. నాగాయలంక కృష్ణాతీరంలోని శ్రీరామ పాదక్షేత్రం ప్రాంగణంలో మత్స్యకారుల ఆధ్వర్యంలో అట్లతద్ది ఊయల వేడుక ఉత్సాహంగా సాగింది.

ఎస్‌వీఎల్ క్రాంతిలో అట్లతద్ది వేడుకలు

అవనిగడ్డ: అవనిగడ్డ ఎస్‌వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో అట్లతద్ది వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ, ఎంపీపీ తుంగల సుమతి, మాజీ ఎంపీపీ బడే కనకదుర్గ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, విద్యార్థినులతో కలిసి ఉయ్యాలలూగారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. అతిథులను ఘనంగా సత్కరించారు.

విజయక్రాంతిలో ఘనంగా అట్లతద్ది వేడుకలు

చల్లపల్లి: స్థానిక విజయక్రాంతి కళాశాలలో గురువారం అట్లతద్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థినులతో కలసి ఉయ్యాల ఊగుతూ సందడి చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్ కళ్యాణి, కనకదుర్గలను శాలువాలతో సత్కరించారు.

ఘనంగా అట్లతద్దె పూజలు



కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్పలో రోటిఊయల ఊగుతున్న యువతులు

కృత్తివెన్ను: అట్లతద్దె పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువజామునే ముత్తయిదువలతో కలసి వాయినాలు తీర్చుకునే మహిళలు సంప్రదాయ వంటకాలతో సామూహిక భోజనాలు చేశారు. సాయంకాలం పంటకాలువలు, చెరువులు, నదుల వద్ద గౌరీదేవికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం ముత్తయిదువులకు అట్లు, అరటిపండ్లతో వాయినాలు సమర్పించుకున్నారు. తీర ప్రాంత గ్రామాలలో రోటి ఉయ్యాలపై యువతీ యువకులు ఉయ్యాలలూగారు.

సచివాలయ కార్యదర్శులకు జీతాల బిల్లులు

కలెక్టర్ ఆదేశాలతో దిగివచ్చిన కమిషనర్ బాపిరాజు

సాక్షి ఎఫెక్ట్

మచిలీపట్నంటౌన్: కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు దిగొచ్చారు. నాలుగు నెలల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో కార్పొరేషన్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా పోలీస్, ఏఎన్ఎం కార్యదర్శులకు జీతాల చెల్లింపు చేయని వైనంతో పాటు ఇతర సమస్యలపై సాక్షిలో 'సచివాలయ కార్యదర్శులకు జీతాలు కరువు' అనే శీర్షికన గురువారం వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శుల రాష్ట్ర జేఏసీ నాయకులు మచిలీపట్నంకు విచ్చేసి కమిషనర్ బాపిరాజును కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అయినా జీతాలు చెల్లింపు, ఇతర సమస్యల పరిష్కారానికి ఆయన ససేమిరా అన్నారు. దీంతో జేఏసీ నాయకులు కలెక్టర్ డీకే బాలాజీని కలిసి కమిషనర్ ఏకపక్ష ధోరణిపై వివరించారు. స్పందించిన కలెక్టర్ కార్యదర్శుల జీతాలను తక్షణమే ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో దిగివచ్చిన కమిషనర్ బాపిరాజు సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన కార్యదర్శులకు జీతాల చెల్లింపు బిల్లులు చేసే పనులను చేపట్టారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ పి.హరీష్, కో చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్, మచిలీపట్నం జేఏసీ చైర్మన్ పువ్వుల కిరణ్‌కుమార్, స్థానిక సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం



గూడూరులో చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీచేసి అధికారులకు సూచనలు ఇస్తున్న జెడ్పీ సీఈఓ

గూడూరు: పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటుగా చెత్తను ఆదాయంగా మలుచుకోవడమే లక్ష్యంగా ఇళ్ల నుంచి చెత్త సేకరణ జరగాలని జిల్లా పరిషత్ సీఈఓ కె.కన్నమనాయుడు అన్నారు. గూడూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త సేకరణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సీఈఓ స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. సంపద కేంద్రం పక్కనే శ్మశానవాటిక ఉండటంతో డంపింగ్ యార్డు సమస్య ఉందని స్థానిక అధికారులు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచి లింగం సులోచనారాణి, మండల పరిషత్ ఏఓ కె.వి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి టి.వి.భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు పోటీలు

నాగాయలంక: నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు, మినహాయింపు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అంశంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు జరిపారు. అవగాహనలో భాగంగా నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న నాగాయలంక సచివాలయం-2 మహిళా సంరక్షణ కార్యదర్శి భోగాది సరిత నేతృత్వంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. మూడు విభాగాల్లో 75 మంది పాల్గొనగా విజేతలైన తొమ్మిదిమందికి స్థానిక ఎస్ఐ కలిదిండి రాజేష్, ఇండియన్ రెడ్‌క్రాస్ నాగాయలంక సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్, పాఠశాల హెచ్ఎం అలపర్తి సత్యనారాయణ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖీ

పెడన: ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా రైస్ మిల్లుల్లో వాస్తవ పరిస్థితులు ఏమిటి, గోనె సంచులు అందుబాటులో ఉన్నాయా లేవా అనే విషయాలపై గురువారం అధికారులు పట్టణంలోని పలు రైస్ మిల్లులను పరిశీలించారు. శ్రీరామాంజనేయ రైస్ ట్రేడర్స్, జయలక్ష్మీ రైస్ మిల్లులను ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్ కుమార్, ఏవో జెన్నీ, పీడీఎస్ డీటీ నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. ఆయా మిల్లులలో గోనె సంచులు స్టాక్ ఎంత ఉంది, ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారనే దానిపై ఆయా మిల్లులకు చెందిన వారి నుంచి సమాచారం తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నవంబరు మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయని, అందుకు అన్నీ సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

పాడిపశువులపై రైతులు శ్రద్ధ చూపాలి

గూడూరు: పాడి పశువుల పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపితే అధిక పాల దిగుబడులు సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి సీహెచ్ నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని ఆకులమన్నాడులో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత రైతులకు అండగా ఉండేది పాడి పశువులే అన్నారు. పశు వైద్య సేవలు అందించడానికి తమ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో గూడూరు డీసీ చైర్మన్ పోతన స్వామి, సర్పంచి మొహమ్మద్ రఫీ, పశుసంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబూరావు, గూడూరు వైద్యాధికారి మీర్ అల్తాఫ్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో 50 గేదెలు, 5 ఆవులు, 65 గొర్రెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి, అవసరమైన పశువులకు చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

అనుమతులు లేని నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని కొబ్బరితోట ప్రాంతంలో ఓ ప్రైవేటు స్థలంలో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా ప్రారంభించిన నిర్మాణ పనులను కమిషనర్ బాపిరాజు, టీపీఓ శ్రీహరి ప్రసాద్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది గురువారం అడ్డుకున్నారు. సంబంధిత స్థల వివాదం కోర్టులో ఉండడంతో కోర్టు స్టేటస్కో ఇచ్చిందని, ఈ దశలో స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని పోలీసు బందోబస్తు నడుమ వెళ్లి అడ్డుకున్నారు. అయితే గజానికి రూ.ఐదు వేలు టీడీపీ నాయకులకు చెల్లించి పనులు చేసుకోవచ్చునని అధికారులు తమకు చెప్పారని నిర్మాణదారులు ఆరోపించారు. నిర్మాణదారులు జనసేన అభిమానులు కావడం గమనార్హం. తాము కూటమి గెలుపునకు కృషి చేస్తే స్థానిక టీడీపీ నాయకుల ద్వారా లంచాలు ఇవ్వాలని తమనే అడగటం హాస్యాస్పదంగా ఉందని వారు వాపోతున్నారు.

చారలున్న ప్రతి పిల్లి పులి కాదు

మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా

పెడన: చారలున్న ప్రతి పిల్లి పులి కాదని, ఇంట్లో కూర్చున్నా..బయట తిరిగినా పులి పులేనన్న పట్టణ టీడీపీ నాయకులకు మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా బదులిచ్చారు. కౌన్సిలర్లు కటకం ప్రసాద్, శిరివెళ్ల జయేష్‌లతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మీ హయాంలో ఒక్క భవనం నిర్మించారా అంటూ టీడీపీ నాయకుడు బొడ్డు వేణు వేసిన ప్రశ్నకు పెడన అర్బన్ హెల్త్ సెంటరు కట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. ప్రస్తుతం పెడన బస్టాండు ఉన్న ప్రాంతంలో నిర్మించడానికి దాత ముందుకు వస్తే అడ్డుకుని ఊరి చివర నిర్మించేలా పావులు కదిపింది మీరు కాదా అంటూ దుయ్యబట్టారు. శిలాఫలకాలపై పేర్ల పిచ్చి తమకు లేదని, హిందూ శ్మశానవాటిక శిలాఫలకంపై తమ పేర్లు పెట్టుకోవడానికి తహతహలాడుతున్నామన్న వారు నిజాలు మాట్లాడాలని హితవు పలికారు.

సంక్షిప్తం

• నాగేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఎస్పీ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెదకళ్లేపల్లి శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారిని గురువారం ఎస్పీ గంగాధరరావు దర్శించుకున్నారు. ఆయన వెంట అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ ఈవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెడన: మండల పరిధిలోని చేవేంద్ర సబ్ స్టేషన్ 11 కేవీ చెన్నూరు ఫీడర్ లైన్లకు తగులుతున్న చెట్టు కొమ్మలు తొలగించడం, లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మచిలీపట్నం విద్యుత్ శాఖ ఈఈ జి.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు ఈ ఫీడర్ పరిధిలోని ఉరిమి, గాయంపాడు, ఔ.ఓ.గుంట గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పెడన టౌన్‌లో గుడివాడ రోడ్ ఏరియాలోను, కాకర్లమూడి గ్రామంలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పై గ్రామాల ప్రజలు గమనించి, విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా కోరారు.

• నూకాలమ్మ తల్లి ఘటం బిందె ఊరేగింపు

రావివారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని రావివారిపాలెంలో ఉన్న నూకాలమ్మ తల్లి గ్రామోత్సవం గురువారం ప్రారంభించారు. అందులో భాగంగా అమ్మవారి ఘటం బిందెతో మోపిదేవిలో ఊరేగించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ఆదివారం వరకు నాలుగు రోజుల పాటు అమ్మవారి ఘటం బిందె ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

• ప్లాస్టిక్‌కు నో చెప్పండిపై అవగాహన

ఘంటసాలపాలెం(ఘంటసాల): ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని ప్లాస్టిక్‌కు నో చెప్పండి అంటూ గుంటూరు లాంకు చెందిన సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం గ్రామంలో గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి గుంటూరు లాంకు చెందిన విద్యార్థినులు ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్ఫలితాలు వివరించారు.

• రంగవల్లులతో గ్రామ చిత్రపటాలు

ఘంటసాల: రంగవల్లులతో గ్రామాల చిత్రపటాలు వేసి ఆయా గ్రామాల స్థితిగతుల పై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల, తాడేపల్లి గ్రామాల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గురువారం గ్రామాల చిత్రపటాలను రంగవల్లులతో వేసి, గ్రామ, వ్యవసాయ భూముల విస్తీర్ణం, గ్రామాల్లో ఎక్కువ సాగు చేస్తున్న పంటల వివరాలు, సీజనల్ క్యాలెండర్ తదితర అంశాలను వివరించారు.

• బ్లోసమ్స్ స్కూలుకు ఎక్సలెన్స్ అవార్డు



మచిలీపట్నంటౌన్: నగరంలోని చెమ్మనగిరిపేటకు చెందిన బ్లోసమ్స్ బిజీ బర్డ్స్ ప్రీ స్కూల్‌కు జాతీయ స్థాయిలో ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈ మేరకు ఈ అవార్డు అందుకున్న స్కూల్ వ్యవస్థాపకురాలు ఎ.కన్య గురువారం మీడియాతో మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ప్రిన్సిపాల్స్ (ఏఐపీ) సంఘం న్యూఢిల్లీలో గత ఆదివారం ప్రారంభ్ అనే కార్యక్రమం ద్వారా ఇండియా ఎర్లీ చైల్డ్ హుడ్ ఎక్సలెన్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ - 2025 కార్యక్రమంలో తనకు ఈ అవార్డును ప్రదానం చేసినట్టు చెప్పారు. ఈ అవార్డును ఈనెల 5వ తేదీ ఆదివారం న్యూఢిల్లీలోని ది రాయల్ ప్లాజా హోటల్లో జరిగిన కార్యక్రమంలో జి లెర్న్ లిమిటెడ్ సీఈవో ఎంఆర్ మనీష్ రస్తోగి, ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎంఎల్ మెహతా, ఉత్తరాఖండ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి రమేష్ థండన్ చేతుల మీదుగా అందుకున్నానన్నారు. దేశవ్యాప్తంగా 33 వేల ప్రీ స్కూల్స్ నిర్వాహకులు పాల్గొనగా తమ స్కూలు ముందు వరుసలో ఉండటం సంతోషంగా ఉందన్నారు.

• డిబేట్ పోటీల్లో లింగారెడ్డిపాలెం విద్యార్థుల ప్రతిభ

కోడూరు: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లా స్థాయిలో నిర్వహించిన డిబేట్ పోటీల్లో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన గాదె కావ్య, కడవకొల్లు అంజలి ద్వితీయస్థానంలో నిలిచినట్లు హెచ్ఎం కోడూరు నాగరత్నకుమారి తెలిపారు. 'ఆడపిల్లలను రక్షించండి' అనే అంశంపై డిబేట్ పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సర్పంచి యర్రంశెట్టి శ్రీదుర్గా, పీఎంసీ కమిటీ చైర్మన్ రాంబాబులు అభినందించారు.

• కోదండ రామాలయానికి రూ.లక్ష విరాళం

అవనిగడ్డ: అవనిగడ్డ మూడవ వార్డులోని ప్రసిద్ధి చెందిన కోదండ రామాలయం అభివృద్ధి నిమిత్తం అదే వార్డుకు చెందిన కూనపరెడ్డి రాధాకృష్ణ, పార్వతి దంపతులు, వారి కుమారులు త్రినాథ్, కుందన్, కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపేణా గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాధాకృష్ణను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నపరెడ్డి కృష్ణ, అన్నపరెడ్డి శ్యామ్‌సుందర్, అన్నపరెడ్డి ఆంజనేయులు, ఓంకారం నాగభూషణం, అన్నపరెడ్డి వెంకటేశ్వర్లు, అంబుల వెంకటప్పయ్య, ఆలయ ప్రధాన అర్చక పండితుడు క్రోవి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

• పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం

మచిలీపట్నం అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్టీసీపీ) ఆధ్వర్యంలో పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం 3.0ను గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. వెంకట్రావుప్రారంభించారు. విద్యార్థులకు పొగాకు వినియోగంతో కలిగే ఆరోగ్య సమస్యలు, నివారణ మార్గాలు, మానసిక స్థైర్యం పెంపొందించుకునే పద్ధతులు వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆషాలత డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భరత్‌సింగ్ నాయక్, సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మి, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, ఎన్టీసీపీ సైకాలజిస్టు ఎం.వి.డి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, సోషల్ వర్కర్ శ్యామల, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

• జీఎస్టీ తగ్గింపుతో ఎన్నో ప్రయోజనాలు

గూడూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల వైద్య రంగంలో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తున్నాయని కృష్ణాజిల్లా డీసీహెచ్ఎస్ శేషుకుమార్ అన్నారు. గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.నరేంద్ర, డీసీ చైర్మన్ పోతన స్వామి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం

మచిలీపట్నంఅర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అంబటి వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు రోగులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత, జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ జి.భానుమూర్తి, నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ గీతా, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ అమృత, మొబైల్ ఆప్తాల్మిక్ యూనిట్ అధిపతి డాక్టర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ నాగజ్యోతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

• పైడమ్మ హుండీ ఆదాయం రూ.1.47 లక్షలు

పెడన: పట్టణంలో ఉన్న గ్రామ దేవత శ్రీపైడమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీల లెక్కింపును గురువారం చేపట్టారు. దేవదాయశాఖ ఈవో జీవీ కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ఆసాది దాసు శ్యామ్, నూతన పాలకవర్గ సభ్యుల సమక్షంలో దేవదాయశాఖ సిబ్బంది హుండీని లెక్కించారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి ఈనెల 9 వరకు వచ్చిన నగదు రూ.1,47,207 లెక్కించారు.

• జీఎస్టీతో తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు

పాపవినాశనం(ఘంటసాల): ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామంలోని హెల్త్ అండ్ వెల్త్ సెంటర్లో గురువారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి.కళ్యాణి, సర్పంచ్ అనిత మాట్లాడుతూ అత్యవసర మందులపై పూర్తిగా జీఎస్టీ తొలగించగా, కొన్ని మందులపై 12 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించినట్లు చెప్పారు.

• నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయులపై మోపుతున్న బోధనేతర పనులకు నిరసనగా శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ ఏడీ విద్యాలతకు వినతిపత్రం అందించారు.